సాక్షి శ్రీకాకుళం

బుధవారం ; 3 ; జనవరి ; 2024



పల్లెవాకిట ఆరోగ్య శిబిరం

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మొదలైంది. తొలిరోజు 4096 మందికి మందులు అందించారు.

- 8లో



మ'హిమం'తా ప్రకృతిదే

మంచు తెరలు కమ్ముకుంటున్నాయి. దారులు కనిపించనంతగా కమ్మేస్తున్నాయి.

- 8లో

మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు

వజ్రపుకొత్తూరు: వేటకు వెళ్లే మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందిస్తున్నట్లు పలాస ఎఫ్‌డీఓ ధర్మరాజు తెలిపారు. మంగళవారం కొత్తపేటలో మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిసాన్ కార్డు క్రెడిట్ లోన్స్ ద్వారా 40 పైసలు వడ్డీకే రుణాలు పొందుతారని తెలిపారు. ఈ సందర్భంగా సీ పోర్టల్ అప్లికేషన్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం గుంటు ఎర్రయ్య కుటుంబాన్ని పరామర్శించారు.

న్యూస్‌రీల్

బొల్లినేని మెడిస్కిల్స్‌లో కొత్త కోర్సులు ప్రారంభం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గల బొల్లినేని మెడిస్కిల్స్‌లో బీఎస్సీ పారా మెడికల్ నూతన కోర్సులను ప్రారంభించినట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ట్రాన్స్‌ఫ్యూషన్ టెక్నాలజీ కోర్సులో ఐదు సీట్లు, రేడియోథెరపీ, టెక్నాలజీ కోర్సుల్లో రెండు సీట్లు ఫిజీషియన్ అసిస్టెంట్ కోర్సుల్లో ఐదు సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కోర్సులకు గాను ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 7680945357, 9121999654 నంబర్లను సంప్రదించాలన్నారు.

పోలీసులు దాడుల్లో 8 మంది జూదగాళ్లు అరెస్ట్

ఆమదాలవలస: మండలంలోని అక్కులపేట తోటల్లో మంగళవారం ఆమదాలవలస ఎస్‌ఐ వై.కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 8 మంది జూదగాళ్లు పట్టుబడ్డారు. వారివద్ద నుంచి రూ. 1,02,230 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 4 ద్విచక్రవాహనాలు, 9 సెల్‌ఫోన్‌లు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఉదారత

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఉదయపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సింగిల్ పేరెంట్ ఉన్న పిల్లలకు కిట్లను పంపిణీ చేశారు. ఇదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు జుత్తు పురుషోత్తం చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ వంటి చదువుకు అవసరమైన వస్తువులతో కూడిన కిట్లను అందించారు. తల్లిదండ్రులు లేని పదిహేడు మంది చిన్నారులకు అందించారు. ఏటా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెటర్నరీ డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమక్షంలో రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వెటర్నరీ డైరీని మంగళవారం ఆవిష్కరించా రు. పలాసలో మంత్రి స్వగృహంలో కొత్తడైరీ, వాల్‌పోస్టర్, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అదే విధంగా శాఖా కార్యాలయాల్లో పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గుంటూరు, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం చైర్మన్‌లతో పాటు జోన్-01కు సంబంధించిన మూడు సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అమరావతి చైర్మన్ సేవా నాయక్, జనరల్ సెక్రటరీ బి.గోవిందరాజులు పాల్గొన్నారు.



● పెన్షన్ల క్రాంతి ముందే సంక్రాంతి

- నేటి నుంచి 8వ తేదీ వరకు పెరిగిన పింఛన్ల పంపిణీ
- పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్
- జిల్లాలో 3.21 లక్షల మంది లబ్ధిదారులు



నియోజకవర్గం	మండలం	పంపిణీ చేసే తేదీ
ఇచ్ఛాపురం	కంచిలి	3
ఇచ్ఛాపురం	కవిటి	3
ఇచ్ఛాపురం	సోంపేట	3
ఇచ్ఛాపురం	ఇచ్ఛాపురం	4
ఇచ్ఛాపురం	ఇచ్ఛాపురం అర్బన్	5
పలాస	పలాస	3
పలాస	పలాస అర్బన్	3
పలాస	మందస	6
పలాస	వజ్రపుకొత్తూరు	6
టెక్కలి	టెక్కలి	3
టెక్కలి	కోటబొమ్మాళి	4
టెక్కలి	నందిగాం	4
టెక్కలి	సంతబొమ్మాళి	5
పాతపట్నం	మెళియాపుట్టి	4
పాతపట్నం	పాతపట్నం	4
పాతపట్నం	హిరమండలం	5
పాతపట్నం	కొత్తూరు	5
పాతపట్నం	ఎల్ఎన్ పేట	5
నరసన్నపేట	పోలాకి	3
నరసన్నపేట	జలుమూరు	5
నరసన్నపేట	సారవకోట	5
నరసన్నపేట	నరసన్నపేట	8
శ్రీకాకుళం	శ్రీకాకుళం	4
శ్రీకాకుళం	గార	5
శ్రీకాకుళం	శ్రీకాకుళం అర్బన్	5
ఆమదాలవలస	ఆమదాలవలస అర్బన్	3
ఆమదాలవలస	సరుబుజ్జిలి	4
ఆమదాలవలస	బూర్జ	5
ఆమదాలవలస	పొందూరు	6
ఆమదాలవలస	ఆమదాలవలస	7
ఎచ్చెర్ల	ఎచ్చెర్ల	3
ఎచ్చెర్ల	రణస్థలం	3
ఎచ్చెర్ల	లావేరు	5
ఎచ్చెర్ల	జి.సిగడాం	6



జగన్ బాబే ఆదుకున్నారు

మాది తిలారు రైల్వేస్టేషన్ . నాకు 75 ఏళ్లు. ఇంత వర కు నన్ను చూసుకున్న నా చిన్న కొడుకు శ్రీనివాసరావు అనారోగ్యంతో ఆరునెలల కిందట మృతి చెందాడు. పెద్ద కొడు కు రాంబాబు వలస జీవిగా వేరే చోట బతుకుతున్నాడు. ఏ ఆధారం లేని సమయంలో సీఎం జగన్ బాబు పింఛన్ డబ్బులను పెంచుతూ మాకు అండగా నిలిచారు. ఈ నెల రూ.3వేలు చేశారు. నేనెలా బతుకుతానో అన్న బెంగ లేదు. వయోభారంతో నానా అవస్థలు పడుతున్న నాకు జగన్ బాబే కన్న కొడుకు అయ్యాడు.

– పొట్నూరు ఇందుమతి, తిలారు రైల్వేస్టేషన్, రావిపాడు పంచాయతీ

శ్రీకాకుళం పాతబస్టాండ్ / జలుమూరు/ కంచిలి : పెద్ద పండగకు ముందు జిల్లాలో పింఛన్ల పండగ మొదలుకానుంది. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ కానుకను రూ.3వేలకు పెంచారు. ఈ పెరిగిన పింఛన్లను జిల్లాలో బుధవారం నుంచి పంపిణీ చేయనున్నారు. కాకినాడలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రా రంభిస్తారు. అనంతరం జిల్లాలో మండలాల వారీగా పింఛన్లు పంపిణీ చేసేందుకు కావాల్సిన ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ నెల నుంచి



జిల్లాలో సుమారుగా పదివేల కొత్త పింఛన్లు మంజూరయ్యా యి. వాటికి సంబంధించిన పరిశీలన కూడా పూర్తయ్యింది. ఇప్పటికే జిల్లాలో 3.20 లక్షల పింఛన్లు ఉన్నాయి. వీరిలో మెడికల్ పింఛన్లు మినహా మిగి లిన వృద్ధాప్యం, వితంతు, ఒంటరి, మత్స్యకార, చేనేత, గీత కార్మికులకు పెంచిన పింఛన్ వర్తిస్తుంది. ఈ నెల 8వ తేదీ వరకు పింఛన్లను అందజేస్తారు. మండలాలు, సచివాలయాల పరిధిలో సమావేశాలు నిర్వహించి ఓ పండగలా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జగన్ బాబు చల్లగుండాలి

సామాజిక పింఛన్లను రూ.3వేలకు పెంచడం సంతోషకరం. పేదవర్గాలకు ముఖ్యమంత్రి జగన్ బాబు పరిపాలనలో ఎంతగానో మంచి జరిగింది. ఆ బాబు చల్లగుండాలి.

– మామిడి పార్వతి, జి.నారాయణపురం, కంచిలి మండలం



ప్రణాళికాబద్ధంగా పంపిణీ

జిల్లాలో పెరిగిన పింఛన్లను పంపిణీ చేసేందుకు ప్రణాళిక చేయడం జరిగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, ఎంపీడీఓ సిబ్బంది ఈ పంపిణీలో భాగస్వాములవుతారు. లబ్ధిదారులకు పండగ వాతావరణంలో పింఛన్లు అందజేస్తారు. – డీవీ విద్యా సాగర్, పీడీ, డీఆర్‌డీఏ

'సమ్మె విరమించి విధుల్లో చేరండి'

నరసన్నపేట: అంగనవాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మె విరమించి విధుల్లో చేరాలని ఐసీడీఎస్ పీడీ బి.శాంతి కోరారు. మంగళవారం నరసన్నపేట వచ్చిన ఆమె స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘాలకు చెందిన ప్రతినిధులతో మాట్లాడారు. గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా అందడం లేదని, విధుల్లో చేరి ఆందోళనలు కొనసాగించుకోవచ్చని సూచించారు. సమ్మె విరమించకపోతే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవచ్చని, కార్యకర్తలు గమనించాలని హెచ్చరించారు. ఆమె వెంట నరసన్నపేట పీఓ నాగమణి ఉన్నారు.



కార్యకర్తలు, ఆయాల సంఘ నాయకులతో మాట్లాడుతున్న పీడీ శాంతి

నేడు సిక్కోలు డ్వాక్రా బజార్ ప్రారంభం

కాకుళం పాతబస్టాండ్: సిక్కోలు డ్వాక్రా బజారు-2024 పేరిట స్వయం సహాయక సంఘాల మహిళలు రూపొందించిన వస్తు, వస్త్ర ప్రదర్శనలు, విక్రయాలను బుధవారం సా యంత్రం నుంచి ప్రారంభించనున్నట్లు గ్రామీ ణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డాక్టర్ డీవీ విద్యా సాగర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడు రోడ్ల కూడలి వద్ద గల నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9.30 వరకు డ్వాక్రా బజారు తెరచి ఉంటుందని చెప్పారు. జిల్లాలో మహిళలు తయారుచేసిన వస్తు సామగ్రితో పాటుగా ఉప్పాడ, కాకినాడ శారీలు, జిల్లాలో పొందూరు ఖద్దరు, అరకు కాఫీ, కర్నూలు చేనేత వస్త్రాలు, వివిధ చేతివృత్తుల ప్రత్యేక వస్తువులు ఉంటాయని ఆయన తెలిపారు.

సుడా పరిధిలోకి పాతపట్నం



పాతపట్నం: శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(సుడా) పరిధిలోనికి పాతపట్నంను చేర్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించిందని, ఇళ్ల లేఅవుట్‌లకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. సుడా పరిధిలోనికి పాతపట్నం, అంతరాబ, ప్రహరాజపాలేం, కొరసవాడ, బూరగాం, కాగువాడ రెవెన్యూ గ్రామాలతో పాటు మండలం మొత్తం రెవెన్యూ గ్రామాలను తీసుకువచ్చారన్నారు. దీంతో పాతపట్నం మండలంలోని 48 రెవెన్యూ గ్రామాల్లోని, 181.02 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో సుడా పరిధి విస్తరించి ఉందన్నారు. పాతపట్నం రెవెన్యూ పరిధిలో 4.76 చదరపు కిలోమీటర్ల పరిధి, అంతరాబ రెవెన్యూ పరిధిలో 4.32 చదరపు కిలోమీటర్లు, కొరసవాడ రెవెన్యూ పరిధిలో 6.8 చదరపు కిలోమీటర్లతో పాటు మండలంలోని రెవెన్యూ గ్రామాలు తీసుకువచ్చారన్నారు. ఈ పరిధిలోని లేఅవుట్‌లను, ప్లాన్‌లకు ఇక నుంచి సుడాలో అనుమతి పొందాల్సి ఉంటుందని తెలిపారు. పాతపట్నం మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణం చేయాలంటే తప్పనిసరిగా సుడాలో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని ఎంపీడీఓ తెలిపారు.

ప్రయోగాలకు సన్నద్ధం



బోటనీ సబ్జెక్టు ఓరియెంటేషన్‌లో పాల్గొన్న అధ్యాపకులు

- ఫిజిక్స్, బోటనీ లెక్చరర్లకు ఓరియెంటేషన్ తరగతులు
- నేడు కెమిస్ట్రీ, జువాలజీ లెక్చరర్లకు క్లాసులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఫిబ్రవరి 11 నుంచి మొదలయ్యే ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధపరచాలని ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు ఆదేశాల మేరకు జిల్లాలో సైన్స్ అధ్యాపకులకు ప్రాక్టికల్స్ పరీక్షలపై ఓరియెంటేషన్ (శిక్షణ సన్నద్ధత)పై రెండు రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు మంగళవారం శ్రీకాకుళంలోని ఎస్ఆర్ విద్యాసంస్థలో ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు అధ్యక్షతన జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఫిజిక్స్, బోటనీ సబ్జెక్టుల లెక్చరర్లకు ఓరియెంటేషన్ తరగతులను నిర్వహించారు. ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ప్రిన్సిపాళ్లు, సీనియర్ లెక్చరర్లు ప్రాక్టికల్స్ నిర్వహణ, టాపిక్స్ వారీగా సన్నద్ధత, ప్రిపరేషన్ వర్క్, రికార్డుల తయారీ తదితర అంశాలపై లెక్చరర్లకు కూలంకుషంగా అవగాహన కల్పించారు.

ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 11 నుంచి 20వ తేదీ వరకు జరగనున్నట్లు ఆర్ఐఓ దుర్గారావు చెప్పారు. జిల్లాలో దాదాపు 150 కేంద్రాల్లో రెండు స్పెల్స్‌లో జరుగుతాయన్నారు. ఇందుకోసం త్వరలో అధికారుల నియామక ప్రక్రియను పూర్తిచేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులను పకడ్బందీగా ప్రాక్టికల్స్‌కు సిద్ధం చేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ బి.శ్యామ్‌సుందర్, కీర్తి తవిటినాయుడు, అన్నపూర్ణారావు, వెంకటేశ్వరరావు, సునీత, శివరామకృష్ణ, పలువురు ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు పాల్గొన్నారు.

నేడు కెమిస్ట్రీ, జువాలజీ సబ్జెక్టుల్లో..

ఇంటర్ ప్రాక్టికల్ సన్నద్ధతలో భాగంగా రెండోరోజు ఓరియెంటేషన్ క్లాసుల్లో భాగంగా బుధవారం కెమిస్ట్రీ, జువాలజీ సబ్జెక్టుల్లో శిక్షణ ఉంటుందని డీవీఈఓ ప్రకాశరావు, ఆర్ఐఓ దుర్గారావు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ఎచ్చెర్లలోని వెంకటేశ్వర విద్యాసంస్థల్లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. వివిధ యాజమాన్య జూనియర్ కాలేజీల్లో కెమిస్ట్రీ, జువాలజీ సబ్జెక్టుల్లో బోధన చేస్తున్న లెక్చరర్లంతా విధిగా హాజరుకావాల్సి ఉంటుందని, గైర్హాజరైన పక్షంలో తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు స్పష్టం చేశారు.

క్లుప్తంగా

సంతలో పొట్టేళ్లకు గిరాకీ



కొల్లివలస సంతలో మేకలు, గొర్రెలు, కోళ్లు కొనుగోలుకు వచ్చిన ప్రజలు

బూర్జ: మండలంలో గల కొల్లివలస సంతలో మేకలు, గొర్రెలు, కోళ్లకి మంచి గిరాకీ ఉంది. సంక్రాంతికి ముందు రెండు వారాలు ముందు కావడంతో మంగళవారం మాంసాహారులు మేకలు, గొర్రెలు, కోళ్ల కొనుగోలు చేయడానికి ఎగబడ్డారు.

రిమ్స్‌లో విద్యార్థుల మధ్య కొట్లాట

శ్రీకాకుళం: రిమ్స్ వైద్య కళాశాలలో విద్యార్థులు రెండు వర్గాలుగా విడిపోయి కొట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం రాత్రి కొందరు విద్యార్థులు మద్యం సేవించి వచ్చి హాస్టల్ భవనంలో దాడులు చేసుకోవటంతో తొమ్మిది మంది గాయపడినట్లు సమాచారం. ఈ దాడులకు భయపడిన తోటి విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించగా రాత్రి రెండు గంటల సమయంలో పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్ది వెళ్లారు. ఈ విషయాన్ని రెండో పట్టణ పోలీసులు ధ్రువీకరిస్తున్నారు. దాడుల విషయం సోమవారం ఉదయం రిమ్స్ కళాశాల అధికారుల దృష్టికి వెళ్లింది. దీనిపై విచారణ కమిటీని నియమించిన ప్రిన్సిపాల్ విషయం మీడియా దృష్టికి వెళ్లకుండా గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించారు. ఆస్పత్రి సలహా మండలి సభ్యులు వరుదు విజయ్ కుమార్ కూడా జరిగిన సంఘటనను ధ్రువీకరించటంతో పాటు విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలంను వివరణ కోరగా సమాచారం ఇవ్వడానికి నిరాకరించారు. ఇలాంటి సంఘటన గత నెలలో జరిగిందని వారిని వసతి గృహం నుంచి బయటకు పంపించామని ప్రిన్సిపాల్ చెప్పారు.

పల్లె వాకిట ఆరోగ్య శిబిరం



నరసన్నపేట: సత్యవరం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



కొత్తూరు: కొత్తపానుటూరులో రోగులకు అందిస్తున్న వైద్యం వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



గార: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



ఆమదాలవలస రూరల్: కలివరంలో జగనన్న ఆరోగ్య సురక్షలో మందులు తీసుకుంటున్న రోగులు

- జిల్లాలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలు ప్రారంభం
- తొలిరోజున 4096 మందికి వైద్యం
- స్వయంగా పరిశీలించిన రాష్ట్ర నోడల్ ఆఫీసర్ సురేష్‌చంద్

జరిగిన వైద్య శిబిరాలు	15
ఓపీ రిజిస్ట్రేషన్	4096
రిఫరల్స్	20
మందుల పంపిణీ	4096
కళ్లకు స్క్రీనింగ్	548

అరసవల్లి: జిల్లాలోని పల్లెల్లో మళ్లీ ఆరోగ్య శిబిరాలు మొదలయ్యాయి. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా తొలి విడతలో 2.67 లక్షల మందికి ఉచిత వైద్య పరీక్షలు, ఉచిత మందులను అందించిన ప్రభుత్వం మంగళవారం రెండో విడత కార్యక్రమాన్ని 15 మండలాల్లో ప్రారంభించింది. తొలిరోజున మొత్తం 4096 మంది గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య సేవలు పొందారు. జిల్లా ఉన్నతాధికారుల షెడ్యూల్ ప్రకారం జనవరి 1నుంచి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించినప్పటికీ, మంగళవారం శ్రీకాకుళం నియోజకవర్గం గార మండలం శ్రీకూర్మం పీహెచ్‌సీ పరిధిలోని అంపోలు–3 గ్రామ సచివాలయంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సమక్షంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే జేఏఎస్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ వై.సురేష్ చంద్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి తదితరుల బృందం జిల్లాలో మొదలైన పలు శిబిరాలను స్వయంగా పరిశీలించారు.

జిల్లాలో ఈ మేరకు తొగరాం పీహెచ్‌సీ పరిధిలో కలివరం, గుత్తావల్లి పీహెచ్‌సీ పరిధిలో తోటవాడ, జి.సిగడాం పీహెచ్‌సీ పరిధిలో మెట్టవలస, కొలిగాం పీహెచ్‌సీ పరిధిలోని మందపల్లి, అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలో అక్కురాడ, కురిగాం పీహెచ్‌సీ పరిధిలో పొన్నుటూరు, శిరిపురం పీహెచ్‌సీ పరిధిలో అంబుగాం, మాకివలస పీహెచ్‌సీ పరిధిలో నరసన్నపేట–2, పోలాకి పీహెచ్‌సీ పరిధిలో గొల్లలవలస, కింతలి పీహెచ్‌సీ పరిధిలో కనిమెట్ట, రావాడ పీహెచ్‌సీ పరిధిలో కృష్ణాపురం, సరుబుజ్జిలి పీహెచ్‌సీ పరిధిలో షళంత్రి, సింగుపురం పీహెచ్‌సీ పరిధిలోని పొన్నాం, వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ పరిధిలో డొంకులపాడు గ్రామ సచివాలయాల వద్ద జేఏఎస్–2 ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించారు. తొలివిడతలో వైద్య పరీక్షలకు వివిధ కారణాలతో హాజరుకాని వారు పెద్ద సంఖ్యలో ఈ సారి రెండో విడతలో వైద్య పరీక్షలకు హాజరయ్యారు.

నలుగురు వైద్యుల పర్యవేక్షణలో..

జేఏఎస్ –2 ఉచిత వైద్య శిబిరాల్లో మొత్తం నలుగురు వైద్యుల బృందం ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా ఏడు రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా 91 రకాల మందులను పంపిణీ చేశారు. ప్రతి మెడికల్ క్యాంపులోనూ ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ఆప్తాలమిక్ వైద్యునితో కలిసిన బృందం ఆధ్వర్యంలో బిపి, షుగర్, హిమోగ్లోబిన్, టి.బి, మలేరియా, టైఫాయిడ్‌ల నిర్ధారణకు రక్త పరీక్షలు, థైరాయిడ్ వంటి ఏడు రకాల పరీక్షలు నిర్వహించారు. అలాగే ప్రత్యేకంగా కంటి వైద్య పరీక్షలు కూడా చేయించారు.

ఊరిలోనే వైద్యం..



మాది కొత్తూరు మండలంలోని కొత్తపానుటూరు గ్రామం. నేను చాలాకాలంగా మోకాళ్ల నొప్పులతో బాధ పడుతున్నాను. సుగర్, బీపీలు కూడా ఉన్నాయి. వైద్యం కోసం ఇంత వరకు ఆటోలో కొత్తూరు, కురిగాం ఆస్పత్రులకు వెళ్లేవాడిని. ఆటోకు సుమారు రూ.100 ఖర్చయ్యేది. ఇప్పుడు మా గ్రామంలోనే ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించడంతో ఇక్కడే వైద్యం తీసుకున్నాను. మందులు కూడా ఇచ్చారు. గత నెలలోనూ వైద్యం తీసుకున్నాను. ఇలా ఉన్న ఊరిలో వైద్యం అందించడం చాలా బాగుంది.

– పొత్తంగి మల్లేసు, కొత్తపానుటూరు

ఉచితంగా మందులిచ్చారు



గతంలో చిన్న జ్వరం వచ్చినా ఇచ్ఛాపురం గానీ, బరంపురం గానీ వెళ్లేవాళ్లం. రెండు నెలల కిందట మా ఇంటికి వచ్చి ఇంటి అందరికీ వైద్య పరీక్షలు చేశారు. ఈ రోజు పెద్ద డాక్టర్లు వచ్చి ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. మాకు చాలా సంతోషంగా ఉంది. మా వయస్సు దాదాపు 70 ఏళ్లు దాటుతోంది. కానీ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం మా ఊరు వచ్చి ఇలాంటి వైద్య పరీక్షలు చేయలేదు.

– సీతా బెహరా, జమున బెహరా, మందపల్లి, ఇచ్ఛాపురం మండలం



ఇచ్ఛాపురం రూరల్: మండపల్లిలో వృద్ధురాలిని ఎత్తుకొని వైద్య శిబిరం వద్దకు తీసుకువెళ్తున్న వలంటీర్ బడ్డి విమల

‘భవిష్యత్ లక్ష్యాలే కీలకం’



విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి సుధ

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి భవిష్యత్ లక్ష్యాలతో ముందుకు సాగాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.సుధ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/ జూనియర్ కళాశాలలో మంగళవారం యువ టూరిజం క్లబ్ ఏర్పాటు చేసి, అనంతరం వ్యక్తిత్వ వికాసం అంశంపై కౌన్సెలింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగం వైపు వెళ్తే భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తోందని, ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ఉచితంగా అందజేస్తోందని చెప్పారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ అధికారి ఎన్.నారాయణరావు మాట్లాడుతూ విజ్ఞానం, వినోదం లక్ష్యం యువ టూరిజం క్లబ్‌లు విద్యా సంస్థల్లో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ జిల్లా మేనేజర్ వి.వి.అప్పలనాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

పీఎంపురంలో రాష్ట్రస్థాయి ఓపెన్ క్విజ్ పోటీలు

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం పెద్దమురహరిపురంలో సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి ఓపెన్ క్విజ్ పోటీలను 13 నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బత్సల కుమార స్వామి జ్ఞాపకార్థం 2015–16 ఏడాది పదో తర గతి విద్యార్థుల ఆధ్వర్యంలో వయసుతో సంబంధం లేకుండా నిర్వహించనున్నట్లు తెలిపా రు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు, షీల్డు అందించడంతో పాటు మొదటి పది స్థానాల్లో నిలిచి వారికి సైతం పురస్కారాలు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాలకు పి.అజిత్–7680825355, సతీష్– 7995986047 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి...

1. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో 12.12.2023 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది, తదనుగుణంగా ప్రభుత్వం G.O లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చెయ్యడం జరిగింది.

a) అంగన్ వాడీ హెల్పర్‌ను అంగన్ వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ 20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44 జారీ చేయబడింది.

b) అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి TA/DA మరియు అంగన్‌వాడీ హెల్పర్‌లకు త్రైమాసిక TA/DA క్లెయిమ్ చేయడానికి మెమో నం.2303564/ 2023/ PROG-I-A1, dt.20.12.2023 జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.

c) అంగన్‌వాడీ వర్కర్లు & హెల్పర్‌ల కొనసాగింపుకు గరిష్ట వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం రూ.1,00,000/- మరియు రూ.40,000/- అందించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం. 47, తేదీ 20.12.2023 జారీ చేయబడింది.

d) అద్దెలు (Rs 66.54 Crs), పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి) (Rs.7.81 Crs) మరియు AWCల నిర్వహణ (చిన్న మరమ్మతులు) (రూ.6.36 Crs) కోసం బడ్జెట్‌లు విడుదల చేయబడ్డాయి.

2. అంతేకాకుండా 2019 నుండి

a) అంగన్ వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500/- లకు, మినీ అంగన్ వాడీ జీతాలను రూ.7,000/- కు, అంగన్‌వాడీ హెల్పర్ల జీతాలను రూ.7,000/- కు పెంచింది.

b) 2013 నుంచి అంగన్‌వాడీల కార్యకర్తలకు, సూపర్వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్- 2 సూపర్ వైజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.

c) ఇదే సందర్భంలో ఈ సూపర్వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.

d) అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డిబిటి ద్వారా రూ.1,313 కోట్లు అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.

e) ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత బీమాను కూడా వర్తింప చేస్తోంది. ప్రమాద బీమాగా రూ. 2 లక్షల వరకూ చెల్లించడం జరుగుతోంది.

f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.

3. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పోషకాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారు సంబంధిత అంగన్ వాడీ సెంటర్లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పని వేళల్లో అందించాలి. ICDS పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం (HCM) మరియు టేక్ హోమ్ రేషన్‌గా అందించాలి.

4. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. AWW లు & AWHలు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్‌లు, THR మరియు గుడ్లు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ (SNP) లబ్ధిదారులకు లేదు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు - 6 సంవత్సరాల పిల్లలను ఆరోగ్య శాఖ ANM సమన్వయంతో అంగన్ వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ ఆరోగ్య పారామితులపై పర్యవేక్షణ జరగటం లేదు.

5. పైన పేర్కొన్న అంశాలదృష్ట్యా, అంగన్ వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరియు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగన్ వాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.

6. పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అందించటానికి, అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించటానికి, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడానికి, జివిడబ్ల్యువి & విఎస్‌డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.

7. కాబినెట్ మంత్రుల గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలుదఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలిసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్టుమెంటు కూడా అందరు అంగన్ వాడీ కార్యకర్తలకు ఐక్ష్ ఎస్.ఎం.ఎస్‌ను పంపించి సమ్మెను విరమించుకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం 53.7% గర్భవతులు రక్తహీనతతో వున్నారు, 29.6%, 5 సంవత్సరాలలోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు. 16.1% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్–5 ప్రకారంగా) వున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూప్లో పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీనిని పురస్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాధమికముగా ఆమోదం తెలిపియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయుచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తుంచుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులను పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవాలని మనవి చేస్తున్నాం. గర్భవతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగా విధులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమింపచెయ్యని యెడల ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

ఇట్లు
కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్, శ్రీకాకుళం

అందం ‘ద్వి’గుణీకృతం



ధనుకువాడ శ్రీకోదండ రామాలయంలో ఉన్న మందారం మొక్కలో ఒక పువ్వు రెండు వర్ణాలతో పూసి చూపరులను ఆకట్టుకుంది. మందారం చెట్టు గంధం రంగు పూలు పూస్తుండేదని ఆలయ అర్చకులు తెలిపారు. మంగళవారం ఒకే పువ్వులో ఎరుపు, గంధం రంగులు కలసి పూయటంతో గ్రామస్తులు పువ్వును చూసేందుకు ఆసక్తిగా వచ్చారు.

– ఎల్.ఎన్.పేట

ఆటో బోల్తా.. కార్పెంటర్ మృతి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని తంగివానిపేట గ్రామానికి చెందిన శిమ్మ శ్రీకాంత్ (21) సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. రూరల్ పోలీసులు ఇచ్చిన వివరాల మేరకు.. కార్పెంటర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ తన వ్యక్తిగత పని కోసం దగ్గరి బంధువు మోహన్‌తో కలిసి ఆటో లో శ్రీకాకుళం వెళ్లి తిరిగి వస్తుండగా అర్ధరాత్రి దాటాక నీలం ఆటో షోరూం వద్దకు రాగానే ఇసుక కుప్ప దిబ్బ వద్ద ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. 108లో రిమ్స్‌కు తరలించినప్పటికీ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మ‘హిమం’తా ప్రకృతిదే



జి.సిగడాంలో ఉదయం 5.20 గంటలకు మంచుతో అలుముకున్న రహదారులు



జి.సిగడాంలో ఉదయం 6 గంటలకు మంచు పడుతున్న దృశ్యం



7:10 గంటల ప్రాంతంలో మంచు ఇలా



8.30 గంటలకు మంచుతో కమ్ముకున్న గ్రామాలు

పల్లెలు పొగ మంచు గుప్పిట చిక్కుకుంటున్నాయి. వేకువజామున ఊరి దారులను కమ్మేస్తున్న మంచు తెరలు వాహనదారులను తెగ ఇబ్బంది పెడుతున్నాయి. – జి.సిగడాం

తెలుగు మహాసభలకు తరలిరండి



గిడుగు విగ్రహం వద్ద నుంచి శోభాయాత్ర ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్:

రాజమహేంద్రవరంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలకు అందరూ తరలి రావాలని ఆంధ్ర సారస్వత పరిషత్ జిల్లా సంఘం పిలుపునిచ్చింది. స్థానిక గిడుగు రామ్మూర్తి విగ్రహం నుంచి మంగళవారం జిల్లా ప్రధాన కార్యదర్శి లఖినాన రవికుమార్, భోగెల ఉమాకవిల ఆధ్వర్యంలో శోభాయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మభాషను గౌరవించడానికి, కాపాడుకోవడానికి మనమంతా నడుం కట్టడానికి రాజమహేంద్రవరం సభలకు కవులు, కళాకారులు, రచయితలు తరలి రావాలని సభలను విజయవంతం చేయాలని అన్నారు. తెలుగు సభలకు సంఘీభావం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ర్యాలీలో చాడ శ్రీనివాస్, కరణ్‌కుమార్, గాంధీ, బలివాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను 108 వాహనంలో శ్రీకాకుళం తరలిస్తున్న సిబ్బంది

బూర్జ : తోటవాడ పంచాయతీ టీఆర్ రాజుపేట ప్రధాన రహదారి వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తోటవాడ పంచాయతీ సుంకరాడ గ్రామానికి చెందిన తోట సత్యనారాయణ, టీఆర్ రాజుపేట గ్రామానికి చెందిన గుండ్రు శ్రీరామ్ కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్ బైక్‌పై కొల్లివలస నుంచి బూర్జ వైపు వస్తున్నారు. టీఆర్ రాజుపేట గ్రామం వద్ద సత్యనారాయణ బైక్ దిగుతుండగా పాలకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వీరి బండిని ఢీకొట్టింది. దీంతో శ్రీరాములు కాలికి దెబ్బలు తగిలాయి. సత్యనారాయణకు కాళ్లు, చేతులు విరిగిపోయాయి. వెంటనే 108 వాహనంలో వారిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సత్యనారాయణను శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. బస్సు ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు వెంబడించి ఆపారు. పోలీసులు వచ్చి బస్సు సిబ్బందిని అదుపులోకి తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

రూ 65.4 లక్షలతో జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులు

- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



దమ్మలవీధిలో రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లా కేంద్రంలో రూ.65.4 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో రూ 65.4లక్షలతో పూర్తిచేసిన రోడ్డు, డ్రైన్‌లను మంత్రి ధర్మాన మంగళవారం ప్రారంభించారు. ఎల్‌బీఎస్ కాలనీలో రూ 9.61 లక్షలతో, దమ్మల వీధిలో రూ. 15.80 లక్షల వ్యయంతో, గుజరాతీ పేటలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైన్‌లను ఆయన ప్రారంభించారు. అలాగే ఆదివారంపేటలో రూ.19.80 లక్షల వ్యయంతో నిర్మించిన మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ బిల్డింగ్ కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.3వేలు చేశారని పేర్కొన్నారు. 14 ఏళ్ల అధికారంలో ఉన్న టీడీపీ అమలు చేయలేని పనులు తాము చేశామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ మాయమాటలు చెబుతోందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ మెంటాడ పద్మావతీ, పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు సాదు వైకుంఠరావు, చల్లా శ్రీనివాస్, అంధవరపు ప్రసాద్, సంతోష్, పైడి రాజారావు, పొన్నాడ రుషి, గన్నిరాజు, కట్టబాబు, శోభన్, కన్నబాబు, మెరక సూర్య నారాయణ,బలగ గణపతి పట్నాయక్, టంకాల బాలకృష్ణ, ఎండ రమేష్, కామేశ్వరి, జ్యోతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐకు తప్పిన ప్రమాదం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని కిమ్స్ ఆస్పత్రి సమీపంలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ ఏఎస్ఐ ప్రాణాల మీదకు తెచ్చింది. ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న పీవీ రమణ నైట్ బీట్ విధులు ముగించుకుని ఉదయం నగరంలోని కిమ్స్ ఆస్పత్రి సమీపంలోకి వచ్చారు. ఈలోగా కిమ్స్ సమీపంలోని ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసిన లారీని రోడ్డుపైకి తీసుకువచ్చేందుకు డ్రైవర్ రివర్స్ గేర్‌లో బండిని నడిపారు. అయితే వెనుక ఉన్న ఏఎస్ఐ బైక్‌ను డ్రైవర్ గమనించలేదు. ఆ వాహనం దూసుకువస్తుండగా ఏఎస్ఐ సమయస్ఫూర్తితో వ్యవహరించి బైక్‌పై నుంచి ఎగరడంతో లారీ బైక్‌ను మాత్రమే ఢీకొట్టింది. దీంతో ఏఎస్ఐ ప్రమాదం నుంచి బయటపడ్డారు.